క్లుప్తంగా

విద్యుత్ స్తంభాలు సరిచేసిన అధికారులు



ఎలకేశ్వరం సమీపంలో విద్యుత్ స్తంభాలు సరిచేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

భీమారం: 'పడిపోయేలా ఉంది.. పట్టించుకోండి' శీర్షికతో ఈనెల 6న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఈమేరకు సోమవారం అంకూసాపూర్–ఎలకేశ్వరం మధ్య ప్రధాన లైనులో పడిపోయేలా ఉన్న స్తంభాలను విద్యుత్ సిబ్బంది పరిశీలించారు. అనంతరం వాటిని యంత్రాల ద్వారా సరిచేసి నిటారుగా నెలబెట్టారు.

బారులుదీరిన పత్తి వాహనాలు



కిష్టంపేటలో బారులుదీరిన వాహనాలు

చెన్నూర్‌రూరల్: పత్తి కొనుగోళ్లు నిలిపివేసి పది రోజులు దాటింది. తిరిగి సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు సోమవారం నుంచి చేపడుతున్నారన్న సమాచారంతో పత్తి మిల్లుల ముందు రైతులు పత్తి వాహనాలతో బారులుదీరారు. అయితే వరలక్ష్మి జిన్నింగ్ మిల్లులో కొనుగోళ్లు చేపట్టడం లేదని తెలియడంతో రైతులు ఆందోళన చేపట్టారు. మార్కెట్‌శాఖ ఉన్నతాధికారులు సర్ది చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

కోటపల్లి తహసీల్దార్‌గా రాఘవేంద్రరావు



బాధ్యతలు స్వీకరించిన రాఘవేంద్రరావు

కోటపల్లి: కోటపల్లి మండల తహసీల్దార్‌గా సోమవారం రాఘవేంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన మహేంద్రనాథ్ కలెక్టరేట్‌కు బదిలీ కాగా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రాఘవేంద్రరావును కోటపల్లికి బదిలీ చేశారు. తహసీల్దార్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్నవారు నేరుగా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు డీటీ నవీన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి పుష్పగుచ్ఛం అందజేశారు.

సెక్షన్ అధికారిగా పదోన్నతి

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ కలమడుగు బీట్ అధికారిగా పని చేస్తున్న ముజీబోద్దీన్‌కు సెక్షన్ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ కాళేశ్వరం సర్కిల్ సీసీఎఫ్ ప్రభాకర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. పెగడపల్లి సెక్షన్‌కు పదోన్నతిపై బదిలీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా సావిత్రిబాయిపూలే వర్ధంతి

- నివాళులర్పించిన నాయకులు, అధికారులు



పాతమంచిర్యాల: సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళలు



లక్సెట్టిపేట: మోదెల గ్రామంలో..



చెన్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



కాసిపేట: నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో సామాజిక సంఘ సంస్కర్త, భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే 128వ వర్ధంతిని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, నాయకులు మొగిలి లక్ష్మణ్, రాజబాబు, సత్యనారాయణ, యోసేపు, సురేశ్, వెంకటేశ్, హరికృష్ణ, షబ్బీర్, శివ పాల్గొన్నారు.

బీసీ ఉద్యమంలో మహిళలు భాగస్వాములు కావాలి

బీసీ ఉద్యమంలో మహిళలు భాగస్వాములు కావాలని బీసీ సమాజ్ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుతోట పద్మ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళా సాధికారత సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ సమాజ్ మహిళా విభాగం సీనియర్ నాయకురాలు నాగలక్ష్మి, జ్యోతి, సంగీత, సాంబలక్ష్మి, సాగరిక, రజని, సునీత, కవిత, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: సావిత్రిబాయిపూలే వర్ధంతి పురస్కరించుకుని అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు చాతరాజు రాజన్న, రాజు, ఆంజనేయులు, లింగన్న, రమేశ్, సుధాకర్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో చదువుల తల్లి సావిత్రిబాయిపూలే వర్ధంతిని మహాత్మ పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. యువజన సంఘం అధ్యక్షులు తాటికొండ సురేశ్, మాజీ ప్రజాప్రతినిధులు రాంలాల్‌గిల్డా, నవాజ్, కృష్ణ, శ్రీధర్, శంకర్, తిరుపతి, శ్రావణ్, నాయబ్, మల్లేశ్ పాల్గొన్నారు.

చెన్నూర్ పట్టణంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు హిమవంతరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సూర్యనారాయణ, చింతల శ్రీనివాస్, భూషణ్‌శర్మ, మహేశ్‌ప్రసాద్, పాతర్ల నాగరాజు, ఈర్ల నారాయణ, మల్లక్క, కరీం పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని దేవాపూర్ నాయకపుగూడలో సోమవారం దేశ మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొమ్ముల బాపు, వివిధ సంఘాల నాయకులు రోడ్డ రాజం, యశ్వంత్ మహరాజ్, బోగె పోశన్న, కొమ్ముల రజిత, మేసినేని అర్చన, రోడ్డ లక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు నవీన, మహిళ సంఘాల సభ్యులు తదితరులు ఉన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని మార్కెట్ ఏరియాలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నాయకులు ఘనంగా జరుపుకున్నారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. సంఘం పట్టణ అధ్యక్షుడు సకినాల శంకర్, నాయకులు బేర వేణుగోపాల్, గట్ల సారంగపాణి, ప్రభాకర్, రాజయ్య తదితరులు ఉన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్, లెక్చరర్లు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి స్మరించుకున్నారు. వైస్‌ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలోచన వేదిక ఆధ్వర్యంలో..

పూలే, పెరియార్, అంబేడ్కర్ ఆలోచన వేదిక ఆధ్వర్యంలో పోచమ్మగడ్డ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ముందు సావిత్రిబాయిపూలే వర్ధంతి, ఉద్యమసారధి మణియమ్మ జయంతి నిర్వహించారు. మహనీయుల విగ్రహాల ముందు క్యాండిల్స్ వెలిగించి మహిళ మహోన్నతులను స్మరించుకున్నారు. అధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి ఆర్.ప్రశాంత్, రవి, చంద్రమౌళి, రవిరాజ్, శంకర్, వెంకటస్వామి, వెంకటేశ్ సిబ్బంది పాల్గొన్నారు.



మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



చెన్నూర్‌లో..



బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ ప్రసాద్

కోటపల్లి: రైతులు వరిలో సస్యరక్షణ చర్యలు పాటించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు బానోత్ ప్రసాద్ రైతులకు సూచించారు. రాంపూర్ గ్రామంలోని వరి పంట క్షేత్రాలను సోమవారం ఏడీఏ ప్రసాద్ సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వరిలో బ్యాక్టీరియా ఆకుఎండు తెగులు వ్యాప్తి చెందుతుందని నివారణకు కార్బడిజం 2గ్రామ్స్, ప్లాంటమైసిన్ 0.3గ్రా, ఎసిఫేట్ 2గ్రా లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏవో సాయి, ఏఈవో సుమన్, రైతులు పాల్గొన్నారు.

యోగా, మ్యూజిక్‌లో చిన్నారికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన చిన్నారి నమని వెంకట అద్విక

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణానికి చెందిన చిన్నారి నమని వెంకట అద్విక మ్యూజిక్, యోగాలో గాడ్సన్ హోలీ స్పిరిట్ టెక్నాలజికల్ అకాడమీ ద్వారా డాక్టరేట్‌ను సోమవారం అందుకున్నారు. అద్విక జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో 5వ తరగతి చదువుతుండగా, చిన్ననాటి నుంచే యోగా, మ్యూజిక్‌లో తల్లిదండ్రులు నమని రమేశ్ కుమార్, మౌనికలు శిక్షణను ఇవ్వడంతో రాణిస్తోంది.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో విద్యుత్ ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ అధికారి (ఎస్‌ఈ) సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. వేలాడుతున్న, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదని, అలాంటి వాటిని గుర్తిస్తే సంబంధిత విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలన్నారు.

ఆర్కే న్యూటెక్ గని ఆదర్శం

- జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిని మిగతా భూగర్భ గనులు ఆదర్శంగా తీసుకోవాలని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ సూచించారు. వార్షిక ఉత్పత్తిని ముందే సాధించిన సందర్భంగా గనిపై సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గని వార్షిక ఉత్పత్తి లక్ష్యం 1.6 లక్షల టన్నులు కాగా, ఈ మొత్తాన్ని మార్చి 31 వరకు సాధించాల్సి ఉండగా మార్చి 8 నాటికే సాధించిందని తెలిపారు. బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా రక్షణలో కూడా న్యూటెక్ గని ఇతర గనులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఓఎంఎస్, ఎస్‌డీఎల్ ఉత్పత్తిలో న్యూటెక్ గని కంపెనీలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. ఉద్యోగులు, అధికారులు, సూపర్‌వైజర్లు సమష్టిగా కృషి చేయడంతోనే ఈ ఉత్పత్తి సాధించారని ప్రశంసించారు. వచ్చే సంవత్సరం కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. గని జీవిత కాలం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



సమ్మిరెడ్డికి బహుమతి అందజేస్తున్న జీఎం

గైర్హాజర్‌పై ఆందోళన..

ఇక గనిలో పనిచేసే యువ ఉద్యోగులకు ఎక్కువగా గైర్హాజరు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్ణీత మస్టర్లు చేయకుంటే ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బొగ్గు ఉత్పత్తిలో అధిక ఉత్పత్తికి కృషి చేసిన కంది సమ్మిరెడ్డితోపాటు ఇతర ఉద్యోగులను అభినందించి బహుమతి ప్రదానం చేశారు. గ్రూప్ ఏజెంట్ రాజేందర్, గని మేనేజర్ స్వామిరాజు, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి ఎస్కే.బాజీసైదా, గ్రూప్ ఇంజినీర్ రవిచరణ్, రక్షణాధికారి రమేశ్, సంక్షేమ అధికారి సృజన్, అధికారులు రాజగోపాలచారి, కృష్ణ, పిచ్చేశ్వరరావు, సాత్విక్, ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, ఫిట్ సెక్రెటరీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- మండలాల్లో ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు



హాజీపూర్‌లో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్

కాసిపేట: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ భోజన్న తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కాసిపేట ఎస్సై ప్రవీణ్, దేవాపూర్ ఎస్సై అంజనేయులుతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం నాలుగు దరఖాస్తులు రాగా స్వీకరించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంఏవో ప్రభాకర్, ఎంపీవో షేక్ సబ్దర్ అలీ తదితరులు ఉన్నారు.

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెండు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఎంపీడీవో సరోజ, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, ఏవో శ్రీకాంత్, ఎస్సై సతీశ్ పాల్గొన్నారు.

దండేపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సమస్యలపై పలువురు అర్జీలు అందించారు. సివిల్ వివాదాలకు సంబంధించి తహసీల్దార్, ఎస్సైతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన ఫిర్యాదులను ప్రత్యేకంగా తీసుకుంటామని తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. ఎంపీడీవో ప్రసాద్, ఎస్సై తహసీనోద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పలువురు భూ సమస్యలపై అర్జీలు అందించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భూ సమస్యలకు సంబంధించి పలువురు అర్జీలు అందజేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోటపల్లి: మండల కేంద్రంలో ప్రజావాణిలో భూ సమస్యల పరిష్కారానికి నిర్వహించే సమావేశంలో నాలుగు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రాఘవేంద్రరావు తెలిపారు. ఎస్సై రాజేందర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేమనపల్లి: భూ సమస్యల పరిష్కారానికి మండల స్థాయిలో తహసీల్దార్, ఎస్సై, ఎంపీడీవోల ఆధ్వర్యంలో సోమవారం మండల కమిటీని ఎన్నుకున్నారు. తహసీల్దార్ రమేశ్, ఎస్సై శ్యాంపటేల్‌ల ఆధ్వర్యంలో 10.30 గంటల నుంచి 2 గంటల వరకు పలు భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు. జిల్లెడ, బుయ్యారం గ్రామాల నుంచి రెండు దరఖాస్తులు వచ్చాయి.

భీమిని: భూ సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణిలో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భీమినిలో ఒకటి, కన్నెపల్లిలో రెండు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్లు బికర్ణదాస్, శ్రావణ్‌కుమార్‌లు తెలిపారు. ఎంపీడీవో శంకర్, ఎస్సైలు విజయ్‌కుమార్, గంగారాం పాల్గొన్నారు.

తాండూర్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ కమిటీ అధికారులు సమావేశమయ్యారు. కాగా రెండు ఫిర్యాదులు అందాయి. ద్వారకాపూర్, రేచినీ గ్రామాల్లో భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఎంపీడీవో శ్రీనివాస్, మాదారం ఎస్సై సౌజన్య, ఆర్ఐ ఏజాజుద్దీన్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ప్రజావాణి కార్యక్రమంలో అందుగులపేట 2, నార్లపూర్ 1, సండ్రోన్‌పల్లి 1 వినతిపత్రాలు వచ్చినట్లు తహసీల్దార్ సతీశ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గల కమ్యూనిటీ హాల్, పోలీస్‌స్టేషన్ పక్కన నిర్మించిన హ్యాపీహోమ్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ప్రజావాణిలో తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మందమర్రి ఎస్సై శివనీతి రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్సై గుమ్ముల రాజశేఖర్, ఆర్ఐ గణపతి ఉన్నారు.

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. చెన్నూర్ మున్సిపాలిటీలో ఇంటి ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదని ఒకరు ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్‌అలీ, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని, ఏవో యామిని, ఐకేపీ ఏపీఎం ప్రమీల, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవి సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారం: ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజావాణికి ఎంపీడీవో ఉమర్ షరీఫ్, ఎస్సై రాజవర్ధన్‌లతో కలిసి హాజరయ్యారు.

మారని అధికారుల తీరు

భీమారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు ఆలస్యంగా వచ్చారు. సాక్షి ప్రజావాణిని సందర్శించగా ఎంపీడీవో, తహసీల్దార్‌తోపాటు మిషన్ భగీరథ అధికారులు మాత్రమే సమయానికి హాజరయ్యారు. ఉదయం 11.15 గంటలకు ఈజీఎస్ ఏపీవో జీనత్, వైద్యశాఖ ఏఎన్ఎం, ఇరిగేషన్ ఏఈలు రాగా 12 గంటలకు మరిన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణికి రావాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా సమయం దాటిన తర్వాత హాజరవుతున్నారు. ఈవిషయంపై ఎంపీడీవో మధుసూదన్‌ను వివరణ కోరగా కొన్ని శాఖల అధికారులు సమయానికి రావడం లేదని, దీనిపై జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు.

ఫిర్యాదుల విభాగానికి స్పందన కరువు

చెన్నూర్: చెన్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగానికి స్పందన కరువైంది. సోమవారం తొలిరోజు భూ సమస్య పరిష్కారం కోసం ప్రజావాణి నిర్వహించగా అర్జీదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ మల్లికార్జున్ అన్నారు. సీఐ రవీందర్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: భూ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ అధికారులతో ఏర్పాటైన కమిటీ సమావేశమైంది. తహసీల్దార్ జోత్స్న, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య, తాళ్ల గురిజాల ఎస్సై రమేశ్ పాల్గొన్నారు. భూ తగాదాలకు సంబంధించి ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. కాగా ప్రచారం చేయకపోవడం వల్లనే అర్జీదారులు హాజరు కాలేదని తెలుస్తోంది.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యువ తెలంగాణ యూత్ ఆధ్వర్యంలో సోమవారం స్టడీ మెటీరియల్, పరీక్షా సామగ్రి ఎస్సై గోపతి సురేశ్ చేతుల మీదుగా అందజేశారు.

పాతమంచిర్యాల: సినిమావాడ ప్రభుత్వ పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం పరీక్ష ప్యాడ్‌లు, స్టేషనరీ అందజేశారు.

'గిరిజనులపై దాడి చట్ట ఉల్లంఘనే'

జన్నారం: ఏళ్లుగా నివాసం ఉంటున్న గిరిజనుల ఇళ్లపై దాడి చేసి, కరెంటు స్తంభాలు కూల్చి, చదును చేయించిన అటవీ అధికారుల చర్యలు చట్టం ఉల్లంఘన కిందకు వస్తాయని హెచ్‌ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు భుజంగరావు పేర్కొన్నారు. సోమవారం జన్నారం అటవీ రేంజ్ గడ్డంగూడలో అటవీశాఖ అధికారులు కూల్చిన ఇళ్లను, ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. గిరిజనులు తమ బాధలు చెప్పుకున్నారు. ఆయన మాట్లాడుతూ వారు తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం కేసులు పెట్టి కోర్టులో హాజరు పరచాలని, ఇళ్లపై దాడి చేసి, కూల్చి వేయడం ఎంతవరకు సమంజసమన్నారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దేవాలయం నిర్మాణానికి శంకుస్థాపన

భీమారం: మండలకేంద్రంలోని బీసీ కాలనీలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీమల్లికార్జున స్వామి దేవాలయానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈమేరకు తెల్లవారుజామున వేద పండితులతో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మొదట ఆలయ నిర్మాణం కోసం భూమిపూజ జరిపారు. అనంతరం హోమం నిర్వహించారు. ఇందులో యాదవ సంఘం నాయకులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. ఆరునెలల్లోనే ఆలయ నిర్మాణం పూర్తిచేయనున్నట్లు యాదవులు తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

నెన్నెల: మండల కేంద్రంలోని గంగాధర దేవాలయ

సంక్షిప్త వార్తలు

ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. వేదపండితులు శ్రీరాంభట్ల కార్తీక్‌శర్మ –సుహాశర్మల ఆధ్వర్యంలో గణపతి పూజ, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛరణలతో శివపార్వతుల కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. పండితులు భూపతి వెంకటేశ్వర్‌రావు, శ్రీరాంభట్ల రాంమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు చిలువేరు సుదర్శన్, రమేశ్, పురుషోత్తం, నారాయణ, స్వామి, అరుణ్‌సింగ్, తోట సుజాత, హరీశ్‌గౌడ్, తిరుపతి ఉన్నారు.

ఘనంగా మల్లన్న బోనాలు

దండేపల్లి: మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లన్న ఆలయంలో పట్నాల వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఒగ్గు కళాకారులు పట్నుపరిచి, మల్లన్నను కొలిచారు. ఆలయ సమీపంలో భక్తులు బోనాలు వండి మల్లన్నకు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ ఆవరణ భక్తులతో సందడిగా కనిపించింది.

ఘనంగా మహిళా దినోత్సవం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమక్షంలో ఆర్డీవో శ్రీనివాసరావు కేక్ కట్ చేసి, ఉత్తమ మహిళలుగా ఎంపికైన వారిని ప్రశంసించారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో సంబరాలు

మంచిర్యాలటౌన్: మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు జిల్లా కేంద్రంలో సోమవారం మాలమహానాడు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కమిటీ తరఫున సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపి, స్వీట్లు పంచుకున్నారు.

చెన్నూర్ సీఐ బదిలీ

చెన్నూర్: చెన్నూర్ పట్టణ సీఐ కట్ల రవీందర్ బదిలీ అయ్యారు. రవీందర్‌ను ఐజీపీ మల్టీజోన్ 1, హైదరాబాద్‌కు రిపోర్ట్ చేయాలని సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. హైదరాబాద్‌లో ఇంటలిజెన్స్ సీఐగా విధులు నిర్వహిస్తున్న పి. దేవేందర్‌రావు చెన్నూర్ సీఐగా బదిలీపై రానున్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు గైర్హాజరు పేరిట ఉద్యోగాలు కోల్పోవద్దని కేకే –5గని ఇన్‌చార్జి మేనేజర్ రమేశ్ పేర్కొన్నారు. సోమవారం కేకే –5 గనిలో ఇటీవల కొద్ది నెలల నుంచి విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

కేకే–5 గని మేనేజర్ బదిలీ

మందమర్రిరూరల్: సింగరేణిలో పలువురు మేనేజర్ స్థాయి అధికారులను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మందమర్రి ఏరియా కేకే –5 గని మేనేజర్ ప్రవీణ వి ఫాటింగ్ పీవో ఏఎల్‌పీ ఏపీఏకి బదిలీ కాగా ప్రాజెక్ట్ ప్లానింగ్ (కార్పొరేట్)లో అడిషనల్ మేనేజర్‌గా పనిచేసిన ప్రవీణ్‌విక్రమ్ కేకే –5 గనికి బదిలీపై రానున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు అదృశ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోయల్కార్ వెంకటవరప్రసాద్(44) అదృశ్యమయ్యారు. ఎస్సై వినిత తెలిపిన వివరాల ప్రకారం వెంకటవరప్రసాద్ ఈనెల 7న ఉదయం 7గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆయన భార్య ఉమా ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు సోమవారం మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఆక్రమణదారులకు అధికారుల వత్తాసు'

వేమనపల్లి: సీలింగ్ పట్టా ఉన్న ఆదివాసీ రైతుల భూమిని ఆక్రమించుకొని ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజన్న, పున్నంలతో కలిసి రైతు మర్మల బుచ్చయ్య తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం నుంచి బుయ్యారం గ్రామానికి చెందిన బుచ్చయ్యకు జిల్లెడ శివారులో ఐదెకరాల భూమికి సీలింగ్ పట్టా ఉందన్నారు. అదే గ్రామానికి చెందిన పొరకొప్పుల విజయ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, సురేశ్‌గౌడ్ భూమి ఆక్రమణకు పాల్పడ్డారు. 15 ఏళ్ల క్రితం పోలీసుల సహకారంతో బెదిరించి భూమిని కాజేశారని, ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. మోకాపైకి వెళ్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. మర్మల మల్లేశ్వరి, తలండి ముత్తయ్య, అంకయ్య, కమల, రామయ్య ఉన్నారు.